ప్రజాశక్తి

బుధవారం 3 జులై 2024

5

విజయనగరం

మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఎపిఇపిడిసిఎల్ ఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

విద్యుత్తు వినియోగదారులు బిల్లులను ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చునని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, జీ పే, పేటిఎం, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చునని తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ పేరు కనిపించదు కనుక వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ eastern power ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని బిల్లులు చెల్లింవచ్చునని తెలిపారు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాల్లెట్స్, కాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు

పాఠశాల విద్యలో ప్రతీదీ సవాల్‌గానే మారుతోంది. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఏటా తగ్గుతోంది. హేతుబద్ధీకరణ కారణంగా పలుచోట్ల పాఠశాలలు మూతపబడిన విషయం తెలిసిందే. ఫలితంగా ప్రాథమిక విద్యలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి వారంతా దగ్గరలోని ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారు. బోధనలో సమస్యలు, సిలబస్‌పై అస్పష్టత, హేతుబద్ధీకరణతో ఉపాధ్యాయులు, విద్యార్థుల అవస్థలు ప్రభుత్వ విద్యావ్యవస్థను చిక్కుల్లో పడేస్తున్నాయి.

విజయనగరంలో మూతపడిన ఆర్‌సిఎం పాఠశాల

- హేతుబద్ధీకరణే ప్రధాన కారణం
- సర్కారు బడుల మూతతో ప్రయివేటు వైపు చూపు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం, గత ప్రభుత్వ నిర్ణయాలు ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో గందరగోళం సృష్టించాయి. 2020–21లో ఉపాధ్యాయుల సన్నద్ధత, విద్యార్థుల సామర్థ్యాలను పట్టించుకోకుండా ఒకేసారి 1–6 తరగతులకు అప్పటి ప్రభుత్వం ఆంగ్ల మాద్యమాన్ని అమలు చేసింది. అప్పటి వరకు తెలుగు మాద్యమంలో చదివిన విద్యార్థులు ఆంగ్ల మాద్యమంలోకి మారాల్సి వచ్చింది. ఏటా ఒక్కో తరగతికి అమలు చేస్తూ ప్రస్తుతం పదో తరగతికి వచ్చింది. ప్రస్తుతం బడుల్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది తెలుగు మాద్యమంలో చదివి, ఉద్యోగాల్లోకి వచ్చినవారే. వీరికి ముందుగా శిక్షణ ఇచ్చి, వారి సామర్థ్యాలను పెంచిన తర్వాత ఆంగ్ల మాద్యమాన్ని అమలు చేస్తే బోధన బాగుండేది. కానీ, ఆంగ్ల మాద్యమాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అవి పెద్దగా ప్రయోజనం ఇవ్వలేదు. విద్యార్థులకు సరైన బోధన అందకపోతే ఏ భాషా సక్రమంగా రాకుండా పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2021–22 వరకు రాష్ట్ర సిలబస్‌ను అమలు చేసిన గత ప్రభుత్వం 2022–23లో ఒక్కసారిగా 8వ తరగతి వరకు సిబిఎస్‌సిలోకి మార్చింది. ఇప్పుడు ఈ విద్యార్థులు పదో తరగతిలోకి వచ్చారు. రాష్ట్రమంతా రాష్ట్ర బోర్డు పరిధిలోని అన్ని బడుల్లోనూ సిబిఎస్ఇ సిలబస్‌నే అమలు చేస్తుండగా.. 2025–26 నుంచి ఇంటర్నేషనల్ బకలారియట్ (ఐబి) సిలబస్‌ను అమలు చేసేందుకు గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఇదే సిలబస్ ఉంటుందో లేదోనన్న సందిగ్ధత నెలకొంది. జిల్లాలో 64ప్రభుత్వ పాఠశాలలకు సిబిఎస్ఇ అనుమతి ఉంది. సిబిఎస్ఇలో పదో తరగతిలో 20శాతం అంతర్గత మార్కులు ఉంటాయి. ఐదు సబ్జెక్టుల విధానం అమలవుతుంది. రాష్ట్ర బోర్డులో సిబిఎస్ఇ సిలబస్ చదివినా ఆరు సబ్జెక్టుల విధానం అమలు చేస్తున్నారు. పైగా 100 మార్కులకు పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఇది రాష్ట్ర బోర్డు విద్యార్థులకు నష్టం కలిగించనుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారు. బైజూస్ కంటెంట్‌తో 8,9 తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. ఆన్‌లైన్ పాఠాలు వింటున్న విద్యార్థులకు సందేహాలు వస్తే వాటిని నివృత్తి చేసే విధానం లేదు. విద్యార్థులు పాఠశాలకు వచ్చినప్పటి నుంచి తరగతుల్లో పాఠాలు వినడానికే సమయం సరిపోతుంది. రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా టోఫెల్ తరగతులు పెట్టారు. బైజూస్ కంటెంట్ ఉన్నా పిల్లలు పూర్తిస్థాయిలో వాడుకోలేక పోతున్నారు. ట్యాబ్‌లుపాడైనా..స్క్రీన్‌లు పగిలి పోయినా సకాలంలో మరమ్మతులు చేయడం లేదు.

తగ్గుతున్న ప్రవేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఏటా విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. 2020–21లో 2,97,471 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే 2022–23లో 2,47,317 మంది, 2023–24లో 2,33,611 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో అన్నారు. అంటే ఏటా పదివేలకు పైగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. జీవో 117ను తీసుకొచ్చి పాఠశాలలను విలీనం చేయడమే ఇందుకు కారణం. పాఠశాలల విలీనంతో దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లలేక విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలవైపు తరలిపోతున్నారు. కరోనా సమయంలో విద్యార్థుల సంఖ్య పెరిగినా ఆ తర్వాత పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. ఒకటో తరగతిలో చేరుతున్న పిల్లల సంఖ్యా తక్కువగానే ఉంటోంది. ఏటా పదో తరగతి పూర్తి చేసి 30వేల మంది వెళ్లిపోతుండగా.. ఈ స్థాయిలో కొత్త ప్రవేశాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండడం లేదు.

హేతుబద్ధీకరణ.. విలీనాలు

వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ, తరగతుల విలీనాలతో మొత్తం గందరగోళం చేసింది. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల బోధనంటూ వీటిని కిలోమీటరు దూరంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 225 పాఠశాలలు మూతపడ్డాయి. చాలా చోట్ల ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులే మిగిలాయి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్ని ఏకోపాధ్యాయ బడులుగా మారగా.. మరికొన్ని పిల్లలు లేక మూతపడ్డాయి. 3–10 తరగతులు ఉండే ఉన్నత పాఠశాలలో 137 మంది, 6–10 తరగతులున్న బడిలో 92 మందిలోపు పిల్లలు ఉంటే ప్రధానోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను తొలగించింది. 1–5 తరగతులు ఉండే బడిలో 30 మంది విద్యార్థుల వరకు ఒక్కరే టీచర్‌ను ఇచ్చారు. ఇలా పోస్టుల హేతుబద్ధీకరణను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జీవో 117 రద్దు చేయాలి

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 కారణంగా పాఠశాలలు అందుబాటులో లేక గ్రామీణ విద్యార్థులు ప్రభుత్వ బడుల నుంచి దూరవుతున్నారు. పాఠశాలల విలీనం వల్ల ప్రైవేటు పాఠశాలల్లో చేరే వారి సంఖ్య పెరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోతోంది. దీనంతటి కారణం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానమే. ఈ నేపథ్యంలో పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే జీవో 117 ను రద్దు చేయాలి.

- జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

వైద్యాధికారులతో మాట్లాడుతున్న చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సర్వజన ఆస్పత్రిలో మెరుగైన సేవలు

- రోగుల కోసం మరిన్ని వసతుల కల్పన : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో కలిసి ఆస్పత్రి సందర్శన
- వైద్యాధికారులతో సమీక్ష

ప్రజాశక్తి–విజయనగరంకోట

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుబంధంగా వున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. రోగులకు మరిన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేలు అదితి గజపతి,కోళ్ల లలితకుమారి, కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో కలసి తొలిసారి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంత్రి సందర్శించారు. పలు విభాగాలతో పాటు రక్తనిధి, ల్యాబ్, ఫార్మసీ, ఎంఆర్‌ఐ స్కాన్, ఐసియు. విభాగాలను సందర్శించి సమస్యలు తెలుసు కున్నారు. అనంతరం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.ఎస్.అప్పల నాయుడు, వైద్య మౌళిక సదుపాయాల సంస్థ అధికారులు, మున్సిపల్ అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య పరిస్థితులను మరింతగా మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లకు రక్తం కొరత వుందని ఆసుపత్రి రక్తనిధి వైద్యులు తెలుపగా త్వరలోనే రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రి ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలనిమంత్రి కార్పొరేషన్ కమిషనర్‌కు సూచించారు. ఒపి విభాగం నుంచి రోగులను వార్డులకు తీసుకువెళ్లేందుకు ఇబ్బంది లేకుండా 20 వీల్‌ఛైర్‌లు, 10స్ట్రెచర్‌లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రి అవసరాల కోసం తాగునీటి వసతులు సరిపోవని ఎమ్మెల్యే అదితి గజపతి వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రెండు బోర్‌వెల్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఒపి విభాగంలో రోగులు, వృద్ధులు నిరీక్షించేందుకు వీలుగా కూర్చొనే వసతులు కల్పించాల్సి ఉందని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని వైద్య మౌళిక సదుపాయాల సంస్థ అధికారులను మంత్రి ఆదేశించారు.

క్యాజువాలిటీ విభాగంలో బెడ్‌ల సంఖ్యను కనీసం 5 నుంచి 10 వరకు పెంచే విషయం పరిశీలించాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, ఆర్‌డిఒ ఎంవిసూర్యకళ, డిసిహెచ్‌ఎస్ గౌరీశంకర్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు, వైద్య ఆరోగ్య మౌళిక సదుపాయాల సంస్థ ఎస్‌ఇ శివకుమార్, ఇఇ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

ప్రజాశక్తి–విజయనగరంకోట

ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం ప్రోత్సహించాల్సి వుందని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ, తమ ఆరోగ్యం కోసం ఈ ఉత్పత్తులనే వినియోగించాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను జాయింట్ కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతు శాస్త్రవేత్తలు, మెంటార్ లు ఏటిఎం, ఎ1 విధానాల ద్వారా పండించిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను తిలకించి వ్యవసాయోత్పత్తుల పంట దిగుబడి, వాటి ద్వారా లభిస్తున్న ఆదాయం, వాటి మార్కెటింగ్ అంశాలపై రైతులతో, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తెలుసు కున్నారు. ఏడాది పొడవునా రైతులకు ఆదాయం లభించేలా ఒకే వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల పంటలను పండించడం ద్వారా ఆదాయం పొందడమే ఈ మోడల్ ప్రత్యేకత అని వారు వివరించారు. ప్రకతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం ఏదైనా వేదికను ఏర్పాటు చేయడం అవసరమని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం డిడి ఆనంద్, వ్యవసాయ శాఖ డిడిలు ప్రకాష్, హేమసుందర్, ఎపిసిఎన్‌ఎఫ్ ప్రతినిధి రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రత్నం తదితరులు పాల్గొన్నారు.

6న పిజి మలివిడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం నిర్వహించిన తొలివిడత కౌన్సిలింగ్ అనంతరం వివిధ కేటగిరీలలో మిగిలిఉన్న సీట్లకు ఈనెల 6న ఓపెన్‌కౌన్సిలింగ్ నిర్వహిస్తామని సిటియు విసి ప్రొఫెసర్ కట్టమని తెలిపారు. ఎన్‌టిఎ నిర్వహించిన సియుఇటి పీజి పరీక్ష రాసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సీట్లు ఇంకా మిగిలితే ఆయా కోర్సులలో, కేటగిరీలలో అర్హత గల డిగ్రీ పాస్ అయిన, లేదా ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసి ఫలితాల కోసం నిరీక్షిస్తున్న వారు కూడా అర్హులని తెలిపారు. యూనివర్సిటీ వెబ్‌సైట్ www.ctuap.ac.inలో లభించే రిజిస్ట్రేషన్ లింకులో https://forms.gle లో తమ పేర్లు నమోదుచేసుకొని జులై 6న జరిగే ఓపెన్ కౌన్సిలింగ్‌కు సర్టిఫికెట్లతో ఉదయం 12గంటల లోపు హాజరవ్వాలని తెలిపారు.

నేడు 'విజయనగరం వెలుగులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి–విజయనగరం కోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జివిఎస్ జయపాలరావు విజయనగరానికి చెందిన 175మంది ప్రముఖుల జీవిత చరిత్రలతో రాసిన 'విజయనగరం వెలుగులు' పుస్తకావిష్కరణ బుధవారం ఉదయం 10.30గంటలకు సంస్కృత కళాశాల రోడ్డులోని ఎస్.కన్వెన్షన్‌లో జరుగుతుందని జయపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఆత్మీ అతిథులుగా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్ధననాయుడు, ఎంఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రాఘవరావు, మాజీ వైస్ ప్రిన్సిపాల్ పిఎఎన్ రాజు హాజరవుతారని తెలిపారు. పుస్తకాన్ని డాక్టర్ మీగడ రామలింగ స్వామి సమీక్షిస్తారని తెలిపారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి కేడిట్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారులు 4 బంగారు, 2 రజిత, 5 కాంస్య, పతకాలు సాధించారు.నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు ఆగష్టు 1,2,3, తేదీల్లో విశాఖపట్నం పోర్టు స్టేడియంలో జరుగు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు చారి పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు

స్పీకర్ కుర్చీ గౌరవాన్ని కాపాడుతా

అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి–విజయనగరం కోట

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా స్పీకర్ కుర్చీ గౌరవాన్ని కాపాడుతానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్న కేంద్ర మాజీమంత్రి అశోక్‌గజపతిరాజు సతీమణి సునీలా గజపతిని మంగళవారం అయ్యన్నపాత్రుడు పరామర్శించారు. అశోక్‌బంగ్లాకు చేరుకున్న ఆయనకు అశోక్‌గజపతిరాజుతో పాటు ఎమ్మెల్యే అదితిగజపతి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రాజ్యాంగ పరమైన స్పీకర్ పదవిని, ఆ కుర్చీకి ఉన్న గౌరవాన్ని కాపాడుతానని అన్నారు. 1983లో పార్టీలో చేరిన తాను చిన్న వయసులోనే ఎమ్మెల్యే, మంత్రిని కాగలిగానని అన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు అనేక పదవులు, ఐదు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగా బాధ్యతలు చేపట్టానన్నారు. ఈసారి చంద్రబాబు నాయుడు డిఫరెంట్ గా నన్ను చూసి స్పీకర్ పదవి ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేలు మంత్రులు కలిసి గౌరవంగా సభను ముందుకు తీసుకెళ్లవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నష్టపోయిన రాష్ట్రాన్ని బాగు చేయాలని చెప్పి ప్రజలు మాకు అధికారం ఇచ్చారని, దాన్ని బాగు చేయాలను కుంటున్నామన్నారు. ఈసారి అసెంబ్లీకి 88మంది కొత్త వారు ఎన్నికయ్యారని, అసెంబ్లీ నిబంధనలపై వారికి శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎంతో అనుభవజ్ఞులైన వెంకయ్య నాయుడు, అశోక్ గజపతిరాజు లాంటి వారి సలహాలు సూచనలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ ఆవరణలో ఉన్న గ్రంథాలయంలో ఆనాటి నాయకులు గౌతు లచ్చన్న, వెంకయ్య నాయుడు లాంటి వారి స్పీచ్ లు పుస్తక రూపంలో ఉన్నాయని, వాటిని చదివితే కొత్తవారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

అయ్యన్నపాత్రుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి, అశోక్

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం కమిషనర్ ఎంఎం నాయుడు పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్న తీరును పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలలో మరింత అవగాహన తీసుకు రావాలన్నారు. కంటోన్మెంట్, కలెక్టరేట్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ అపరిశుభ్ర పరిస్థితులను చూసి పారిశుధ్య కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీరు నిలవలేకుండా చూసుకోవాలని తెలిపారు.

తాటిపూడి రిజర్వాయర్ అభివృద్ధికి కృషి

సాగునీరు విడుదల చేసిన మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి–గంట్యాడ

రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం తాటిపూడి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రిజర్వాయర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రిజర్వాయర్ శివారు భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గంట్యాడ, జామి, ఎస్.కోట మండలాల్లోని 35 గ్రామాల్లో సుమారు 15,365 ఎకరాలకు సాగునీరు అందించే తాటిపూడి రిజర్వాయర్ ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుందన్నారు. అయితే గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, కాలువలు పూడికలతో నిండిపోయా యని అన్నారు. వచ్చే ఏడాది నాటికి అన్ని కాలువల్లో పూడికలను తొలగిస్తామని చెప్పారు. ఎంఎస్ ఛానల్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖపట్నం తాగునీటి అవసరాలను తీరుస్తున్న ఈ రిజర్వాయర్ అభివృద్ధికి విశాఖనుంచి రావాల్సిన నిధులకోసం ప్రయత్నం చేస్తామని అన్నారు. బోటును పునరుద్ధరించి, ఈ ప్రాంతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా రంగాల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని అన్నారు. తాటిపూడి రిజర్వాయర్ అభివృద్ధికి తనవంతు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్.కోట ఎంఎల్‌ఎ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ మూడు మండలాల్లోని సుమారు 35 గ్రామాల్లోని 40వేల మంది రైతుల భూములను ఈ రిజర్వాయర్ సస్యశ్యామలం చేస్తోందని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులను కూడా గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కనీసం మరమ్మతులకు కూడా నిధులు కేటాయించలేదని అన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వమని, రైతుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కషి చేస్తామని అన్నారు. స్థానిక రైతు, టిడిపి నాయకుడు రొంగలి కృష్ణ మాట్లాడుతూ, తాటిపూడి ఆయుకట్టు రైతులు, ఈ ప్రాంత ప్రజల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, ఇరిగేషన్ ఇఇ సీతారామనాయుడు, డిఇలు గోవిందరావు, పాండు, జెఇ తమ్మినాయుడు, ఎంపిడిఒ భవాని, తాహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు, ఆయుకట్టు రైతులు పాల్గొన్నారు. అనంతరం బుడతనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండపల్లి భాస్క రనాయుడు, రంది రామునాయుడు, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే లలితకుమారి

4న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

విద్యార్థి సంఘాల పిలుపు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

నీ పరీక్షల్లో జరిగిన అవతవకలు నేపథ్యంలో అసమర్ధ ఎన్‌టిఎను రద్దు చెయ్యాలని, కేంద్ర విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న జరిగే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అమర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షాపత్రాలను లీక్ చేసి భారీ కుంభకోణం జరిగిందన్నారు. నీట్ పరీక్ష ఫలితాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఉన్న అడ్మిషన్ విధానాలను కేంద్రీకృత ప్రవేశ పరీక్షలతో భర్తీ చేసే ప్రయత్నాలను ఉపసంహరించు కోవాలన్నారు. ఈడిమాండ్లతో పాటు పాఠశాలల మూసివేతను ఆపాలని కోరుతూ దేశవ్యాప్తంగా జూలై 4 న జరిగే విద్యా సంస్థలు బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బంద్ గోడపత్రికను విడుదల చేశారు. సమావేశంలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు రవికుమార్, రాజు, వెంకటరమణ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు గౌరు, ప్రసాద్, భాను, జ్యోతి, శ్రావణి పాల్గొన్నారు. విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు ప్రచారం నిర్వహించింది. కార్యక్రమంలో పిడిఎస్‌ఒ నాయకులు బి రాకేష్ సిహెచ్ దిలీప్ ఏ దినేష్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

సేవే లక్ష్యంగా రోటరీ

అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు శేఖర్ మెహతా

ప్రజాశక్తి–విజయనగరం కోట

సేవే లక్ష్యంగా ఇంటర్నేషనల్ రోటరీ పని చేస్తుందని ఆ సంస్థ అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు శేఖర్ మెహతా, విజయనగరం రోటరీ నూతన గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్‌విఎన్ కన్వెన్షన్‌లో నూతన గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవానికి రొటేరియన్ శేఖర్ మెహతా ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంతకుముందు రోటరీ క్లబ్ ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న శాశ్వత ప్రాజెక్టులు – రోటరీ స్వర్గధామాన్ని సందర్శించారు. రోటరీ కమ్యూనిటీ హాలు, రోటరీ పార్వతీదేవి ఆంచలియ బ్లడ్ సెంటర్, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ లను సందర్శించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో రోటరీ సేవలందిస్తుందన్నారు. 23 దేశాలను పోలియో రహిత దేశాలుగా తీర్చిదిద్దడంలో తమ కృషి ఉందన్నారు. బ్లడ్ బ్యాంక్స్, స్కూల్స్, చిన్నారులకు హార్ట్ సర్జరీలు తదితర వాటిపై దృష్టి పెట్టామన్నారు.

పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

విజయనగరం టౌన్ : జిల్లాలో పశువుల అక్రమ రవాణాను, గోవధను అరికట్టాలని ఎపి గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ కలెక్టర్ అంబేద్కర్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. జిల్లాలో మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిఆర్ సత్యనారాయణ, చోళ్ళ రాజకుమారి, కార్యదర్శి నీలాపు దేవి, మద్దిల సోంబాబు పాల్గొన్నారు.

మృతి చెందిన హలామ్, నర్సింహమూర్తి

రెండు బైకులు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి–బొండపల్లి

మండలంలోని అంబటివలస సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బొండపల్లి ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం నుంచి సాలూరు వైపు వస్తున్న రియాన్ హలామ్(25), గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న గంట్యాడ నర్సింహమూర్తి(40) అంబటివలస సమీపంలో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. నర్సింహమూర్తి విజయనగరం సమీపంలో గల కనపాక చెందినవారు. రియాన్ హలామ్ బీహార్ కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులైన రోహిత్ సింగ్, గంట్యాడ సరోజినిలను చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గజపతినగరం సిఐ ప్రభాకర్ పరిశీలించారు.

రాస్తారోకో చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికుల రాస్తారోకో

దత్తిరాజేరు రూరల్ : డ్రైవర్లను క్రిమినల్స్‌ను చేస్తూ ఐదేళ్ల జైలు శిక్ష పడే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారత న్యాయ సంహిత చట్టాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మానాపురం సంతోట వద్ద ఆటో కార్మికులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఆటో యూనియన్ నాయకులు బి అప్పలనాయుడు, కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే ఐపిఎస్ చట్టం ఉంటుండగా బిఎన్ఎస్ చట్టం తెస్తూ జరిమానాలు, జైలు శిక్షలు కఠినంగా పెట్టడం మోడీ దుర్మార్గానికి మచ్చుతునక అని అన్నారు.. ఆటో కార్మికుల జీవనానికి తీరని దెబ్బగా ఈ చట్టం ఉంటుందని అభద్రతతో పనిచేయాల్సి వస్తుందని కుటుంబాల పోషణకు అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ అధికారం రాగానే జూలై 1 నుంచి ఈ చట్టాన్ని అమలు చేసేందుకు ముందు నుంచే ప్రణాళికలు సిద్ధం చేశారని ఈ దుర్మార్గానికి అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంగారయ్య రమేష్, గౌరీ, వెంకటేష్, గణపతి గౌరీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతో పేరుకుపోయిన బట్టి కాలువ

పూడికతో పేరుకుపోయిన కాలువ

భోగాపురం: భోగాపురం గ్రామం మధ్యలోనున్న బట్టి కాలువలో పూడిక పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ బట్టిలో చెత్తతో పాటు చిన్న చిన్న మొక్కలు పెరిగి నీరు వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. ఆంజనేయ స్వామి గుడి నుంచి కాలువ నిండా ఇదే పరిస్థితి ఉంది. ఇది ఇరిగేషన్ శాఖకు చెందిన కాలువ కావడంతో ఆ శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో పై నుంచి వచ్చే నీరు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. అసలే వర్షాకాలం కావడంతో కాలువలో ఉన్న పూడికను తీస్తే నీరు వెళ్లేందుకు ఇబ్బంది ఉండదని స్థానికులు చెబుతున్నారు. అయితే పూడిక తీతపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి దృష్టి పెట్టినట్లు సమాచారం.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

భోగాపురం : ఈ నెల 4న భోగాపురం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కాపుగంటి కృష్ణారావు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ విజయనగరం వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి ఆలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని ప్రజలందరూ దీనిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఉత్తమ రైతులకు ఘన సన్మానం

శృంగవరపుకోట: ప్రపంచ రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ కె. రమేష్ ఉత్తమ రైతులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఎడిసి అల్లు గిరి వితరణతో ఉత్తమ రైతులు రెడ్డి వెంకట్రావు, సిరిపురపు సన్యాసినాయుడును ఘనంగా సన్మానించామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం ప్రముఖ్యతనూ, వ్యవసాయ దారుల స్థితి గతులను గూర్చి వివరించారు. దేశానికి అన్నం పెట్టె రైతులను అందరూ గౌరవించాలని, వారికి ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇతర సిబ్బంది, అల్లు గిరి, సత్యన్నారాయణ, జి. పైడితల్లి, సన్యాసయ్య దేవస్థానం చైర్మన్ పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ప్రకారం పింఛన్లు పంపిణీ చేయాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ప్రోటోకాల్ ప్రకారం పింఛన్లు పంపిణీ చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలో ప్రోటోకాల్ పాటించకుండా వార్డు సచివాలయ కార్యదర్శులు ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ పై నగర పంచాయతీ వైసిపి కౌన్సిలర్లు మేనేజర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైసిపి కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, చిక్కాల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కొత్త ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లు ప్రోటోకాల్ పాటించకుండా కూటమి నాయకులతో పంపిణీ చేయడం సమంజసం కాదన్నారు. ఆయా వార్డుల్లో కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా వార్డు కార్యదర్శులు ఇష్టానుసారం పింఛన్లు పంపిణీ చేయడం దారుణమన్నారు. ప్రోటోకాల్ పాటించకుండా పింఛన్లు పంపిణీ చేసిన వార్డు కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైల మురళి, బూర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న గిరిజనులు

బొబ్బిలి: ఎమ్మెల్యేగా బేబినాయన విజయం సాధిస్తే పూజలు చేస్తామన్న దేశతల్లికు రామన్నదొరవలస గిరిజనులు మొక్కుకున్నారు. అత్యధిక మెజారిటీతో బేబినాయన విజయం సాధించడంతో గిరిజనులు మంగళవారం దేశతల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో ఎమ్మెల్యే బేబినాయన పాల్గొని పూజలు చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై బేబినాయన వినతులు స్వీకరించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు పని చేస్తామని బేబినాయన అన్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోవాలి

శృంగవరపుకోట: ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని తిమిడి గ్రామ సర్పంచ్ వబ్బిన త్రినదమ్మ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ముందుగా గ్రామ కార్యదర్శి రంగారావు అజెండా ప్రవేశ పెట్టారు. విఆర్ఓ అప్పలరాజు మాట్లడుతు భూ రిసర్వే వివరాలు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ క్లోజ్ చేశారని ఈ నెల 15వ తేది వరకు ఓపెన్ కాదని చెప్పారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు, ఈ క్రాఫ్ చేయించుకోవాలన్నారు. విత్తనాల పంపిణీ పూర్తి చేశామన్నారు. ఏఎన్ఎం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సభలో ఎంపిటిసి పదాల ధర్మారావు, ఉప సర్పంచ్ బర్ల స్వామి నాయుడు, మాజీ సర్పంచ్ రాయవరపు రవి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిసిసి కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

విజయనగరం టౌన్ : విజయనగరం జిసిసి సోప్‌యూనిట్‌లో పనిచేస్తున్న బోర ఆదినారాయణను అనారోగ్య కారణాలు చూపించి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విధుల నుంచి యాజమాన్యం నిలిపివేసిందని, పలు మార్లు స్థానిక మేనేజర్ తో చర్చించిన ఫలితం లేకుండా పోయిందని, తక్షణమే అతన్ని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నంలో జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్‌ను బోర ఆదినారాయణతో కలిసి వినతిపత్రం జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు వినతినిచ్చారు. జనవరి 30న ఆదినారాయణ పరిశ్రమలో అస్వస్థతకు గురై ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్లో వైద్య సహాయం పొందారని, అనంతరం ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ సర్టిఫైడ్ చేసి ఇచ్చారని, అయినా అతన్ని విధుల్లోకి తీసుకోకుండా యాజమాన్యం దాటవేత ధోరణితో వ్యవహరించిందని తెలిపారు. తక్షణమే అతని విధుల్లో తీసుకోవాలని లేదంటే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విదేశీ విద్యపై 'సీతం'లో అవగాహన సదస్సు

విజయనగరం : స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐర్లాండ్ దేశానికి చెందిన డేవిడ్ ఫాలెన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, యూ.కె, యూరప్, ఐర్లాండ్ దేశాలలో చదువుకోవాలనుకున్న విద్యార్థులకు లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ద్వారా అవగాహన కల్పించి విదేశాలకు పంపిస్తున్నామని తెలిపారు. ఈ దేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు టోఫెల్, పిటిఇ, ఐల్ట్స్ వంటి ఎగ్జామ్స్ కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఉదారత

వేపాడ : మండలంలోని వీలుపర్తి సచివాలయానికి చెందిన మహిళా పోలీసు ఉదార భావాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన రంది రామయ్యమ్మ విశాఖలోని గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని తెలుసుకుని తన సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి రూ.7వేలు పింఛను సొమ్మును మంగళవారం ఆమెకు అందించారు. కానిస్టేబుల్ సుగుణ రాణి ఉదార భావానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - రేగిడి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ శ్యామల కుమారి, తహశీల్దార్ రాములమ్మ, ఎంఇఒ వరప్రసాదరావు సమక్షంలో ప్రజా దర్బార్‌లో ఆయన మంగళవారం వినతులు స్వీకరించారు. ముఖ్యంగా గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయి ఉద్యోగులు ప్రజలకు జవాబుదారుతనంగా ఉండాలన్నారు. వ్యవసాయ అనుబంధ ఉద్యోగులు గ్రామాల్లో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ ప్రజలకు అవసరమన్నారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి 38 వేల ఎకరాలకు సాగునీరు అవసరం కాగా, కేవలం 25 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు వస్తుందన్నారు. తోటపల్లి, మడ్డువలస జలాశయాల నుంచి శివారు గ్రామాల వరకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. టిడిపి నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, కర్నేన మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసి మొట్టమొదటిసారిగా వంగర విచ్చేసిన ఆయనకు అధికారులు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తెచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సల్మాన్‌రాజు, తహశీల్దార్ చిరంజీవి, టిడిపి నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, ఉదయాన మురళీకృష్ణారావు, లచ్చుబుక్త కృష్ణమూర్తి, మజ్జిగ గణపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు

బొబ్బిలి: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో మంగళవారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల ప్రజలు రోడ్లు, తాగునీరు, సాగునీరు సమస్యలు పరిష్కరించాలని వినతులిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పని చేస్తామన్నారు. దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

రేగిడి: ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ మార్కెట్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే అదితి గజపతి రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడ్స్ షెడ్ జంక్షన్ లో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద రెండు వైపులా మార్గాలను తక్షణం ప్రారంభించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేస్తామన్నారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని తెలిపారు. బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డేపు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు సవర్మల్ చౌదరి, నిర్మల్ కుమార్ జైన్, కె.ఎల్. నరసింగరావు, పివి రామారావు, ప్రవీణ్ కుమార్ అంచిలియా, టిడిపి నాయకులు ఐవిపి రాజు, పిల్లా విజయకుమార్, కాళ్ళ గౌరీశంకర్ పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే అభివృద్ధి

విజయనగరం కోట : సమిష్టి కృషితోనే జిల్లాను అభివృద్ధి పరుచుకుందామని ఎమ్మెల్యే అదితి అన్నారు. మంగళవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎమ్మెల్యేను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ నాకు ఈ అవకాశం, ఈ అభిమానం నా పూర్వీకుల పుణ్యఫలమని అన్నారు. తన తండ్రిలా అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి ప్రకాష్, కార్యదర్శి రవ్వా శ్రీనివాసరావు, ఉమెన్స్ వింగ్ అధ్యక్షులు జి.జ్యోతి, కార్యదర్శి ఆర్.మంజుల , మాజీ అధ్యక్షులు శివ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ చేస్తున్న కృషిని వివరించారు. రానున్న కాలం పారిశ్రామికంగా విజయనగరం జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. మాజీ అధ్యక్షులు ఉసిరికాయలు చంద్రశేఖర్ ,శివకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమ్మ పేరుతో మొక్క నాటుదాం

శృంగవరపు కోట: స్థానిక బాపూజీ సేవా సంఘం ఆవరణలో గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని అందరమూ ఏటా జరుపుకుందామన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి కార్యకర్తలందరూ తమ తల్లితో కలిసి లేదా తల్లి చిత్రపటంతో ఒకమొక్క నాటమని బిజెపి ఆంధ్రప్రదేశ్ పిలుపు నిచ్చిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యస్.ఆర్.వి.రూపేష్ అన్నారు. పార్టీ మండల కార్యదర్శి బొండపల్లి చంద్రశేఖర్, మహిళామోర్చా అధ్యక్షులు టి.పార్వతీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.దాశరథి, బాపూజీ సేవా సంఘం సభ్యులు బర్ల స్వామినాయుడు, చిన్ని కృష్ణ, బి.కృష్ణారావు యాదవ్, వై.షణ్ముఖేశ తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ మార్కెట్ స్థలం మార్పు

తొమ్మిది నెలలకు రూ. 4,53,550 వేలం
వారపు సంత వేలం వాయిదా

ప్రజాశక్తి - జామి

జామి రోజువారి మార్కెట్ కష్టాలు త్వరలో తీరనున్నాయి. నెల రోజుల్లో మార్కెట్ నిర్వహణ స్థలం మార్పుకు వేలం దారులు సిద్ధపడాలని పంచాయతీ అధికారులు పెట్టిన షరతుకు లోబడి మంగళవారం జామి మార్కెట్ వేలం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి అధ్యక్షతన జరిగిన వేలం పాటలో గ్రామానికి చెందిన కొయ్యాన రామునాయుడు రూ. 4,53,550 వేలంలో మార్కెట్ నిర్వహణ బాధ్యత దక్కించుకున్నారు. తొమ్మిది నెలల కాలానికి గానూ, వేలం జరిగిందని అధికారులు వెల్లడించారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా మూడు నెలల పాటు పాట లేకుండా మార్కెట్ నిర్వహణ చేపట్టిన గత వేలం దారులు నుంచి రూ. 90వేలు వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే వారపు సంత వేలం పాటదారులు లేక వాయిదా పడింది. గతేడాది మార్కెట్, వారపు సంతకు కలిపి పంచాయతీకి రూ. 5.52 లక్షల వరకూ ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 58 మంది వేలం దారులు, ఇఒపిఆర్‌డి శ్రీదేవి పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు, సర్పంచ్

రాజుల చెరువుకు హద్దుల గుర్తింపు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక రాజుల చెరువు సర్వే నెంబరు 462లో ఆక్రమణపై చెరువు సంఘం రైతులు కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. కలెక్టర్ పదిరోజులో పరిష్కరిస్తామని చెప్పినట్లుగానే ఆర్‌డిఒ కార్యాలయం నుంచి సర్వే ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ వచ్చి మండల సర్వేయర్ వెంకటరావు, విఆర్ఓ రమణ తదితర సహాయక సిబ్బందితో కలసి, చెరువు సంఘం రైతులు, సరిహద్దు భూమి యజమానుల సమక్షంలో మంగళవారం సర్వే చేశారు. సర్వే అనంతరం తెలిపిన హద్దుల విషయంలో రైతులు, భూ యజమానులలో కొందరు సంతృప్తి చెందినట్లు తెలిపారు. రైతులకు సరిహద్దులతో కూడిన చెరువు కొలతల ప్రతిని త్వరలో తహశీల్దార్ కార్యాలయంలో పొందవచ్చునని సర్వే ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ తెలియజేసారని రైతు సంఘం సభ్యుడు నానిగిరి సూరిబాబు తెలిపారు. పంట కాలువ ప్రవాహానికి ఎటువంటి ఆటంకమూ ఉండబోదని, సూచించిన కొలతలు మేరకు స్థలాన్ని అలానే విడిచిపెడతామని హాజరైన భూ యజమానులు సర్వే ఇనస్పెక్టర్ సమక్షంలో అంగీకరించారు. ఈ విషయంలో ఎటువంటి వివాదమూ ఉండకూడదని అధికారులు సూచించారు. తమ అర్జీపై వెంటనే స్పందించిన కలెక్టర్, జిల్లా అధికారులకు చెరువు సంఘం రైతులు పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వైస్‌ఎంపిపి నానిగిరి రమణాజీ, మాజీ వార్డు సభ్యుడు చిప్పాడ రమణ, రైతులు ఈశ్వరమ్మ, కొటాన రాము, రమణమ్మ, పొట్నూరు రమణ, దామోదర శ్రీను, వసంత సత్యారావు, మోపాడ కృష్ణ, పెంటమ్మ, నానిగిరి కాంతం పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలం లోని రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు వ్యవసాయ శాఖ సిబ్బంది అందచేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అందించిన ఎరువులు, విత్తనాలు నాణ్యతలో ఎటువంటి లోపం ఉండకూడదని, మండలంలో అందరి రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఏ ఒక్క రైతుకి ఎరువులు గాని, విత్తనాలు గాని చాలలేదు అనే మాట రాకూడదని అన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. మండలంలో ఏ ఒక్క రైతుకు ఏ అవసరం వచ్చిన తాను అందుబాటులో ఉంటానని, ప్రజా ప్రతినిధులు వెంటనే తనకు తెలియ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపి తలచుట్ల హరి బాబు, పప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సీజనల్ వ్యాధులపై ప్రణాళిక

ప్రజాశక్తి - కొత్తవలస

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. మంగళవారం ఉదయం ఆమె అధ్యక్షతన మండల కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా వర్షాకాలం కారణంగా జులై నుంచి అక్టోబర్ వరకు మండలంలో ఎటువంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తకుండా చూడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మాసమంతా ప్రతీ గ్రామంలో జ్వరాలు పైన, వాంతులు విరోచనాలు వచ్చు కారణాలపై, డెంగీ వ్యాధి నివారణా మసోత్సవాలు, స్టాప్ డయేరియా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో గృహ సందర్శన చేసి 0 నుంచి 5 సంవత్సరాల వయసు ఉన్న చంటి పిల్లలు గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. కింద స్థాయిలో పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ కాలంలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రమణయ్య , తహశీల్దార్ చంద్రశేఖర్, వియ్యంపేట వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ, కొత్తవలస వైద్యాధికారి డాక్టర్ సీతల్ వర్మా, ఇఒపిఆర్‌డి కర్రి ధర్మారావు, పిహెచ్ఎన్ రమణమ్మ, ఇఒ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

తోటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తూ అకాల మరణం చెందిన డి.రాఘవేంద్రరావు కుమారుడికి గరుగుబిల్లి ఎంపిడిఒ కార్యాలయంలో సహాయకుడిగా నియమిస్తూ జెడ్‌పి చైర్మన్ ఎం.శ్రీనివాసరావు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా , డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి, సోంపురం ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, డైరీలు, స్కూల్ రికార్డులు, మిడ్డే మీల్స్, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు సకాలంలో వచ్చే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు పేరెంట్స్‌కు అవగాహన కల్పించాలన్నారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

అతిసార నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అతిసార నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపిపి అంబళ్ళ సుధారాణి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సతివాడ, కొండవెలగాడ పిహెచ్‌సి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి అంబళ్ళ సుధారాణి మాట్లాడుతూ గ్రామాల్లో అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వర్షాలు పడుతున్నాయి కాబట్టి ఈగలు, దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాపింప చేస్తాయని వీధుల్లో, కాలువల్లో క్లోరినేషన్ జరిపించాలని ప్రాథమిక స్థాయిలో జ్వరాలను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం స్టాప్ డైయేరియా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులు అంబళ్ళ శ్రీరాముల నాయుడు, ఎంపిడిఒ జి. రామారావు, ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

సమయపాలన పాటించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ప్రార్థన కార్యక్రమాన్ని క్రమశిక్షణంగా నిర్వహించాలని సూచించారు. నిరంతర ప్రక్రియలు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. విద్యార్థుల హాజరు 10.30 గంటలలోగా వేయించడం, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచేలా చూడడం, నైపుణ్యంతో కూడిన విద్యను భోదించడం, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యత ఉండేలా చూడడం తదితర అంశాలపై తగు దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యార్థుల ఆత్మాభిమానం దెబ్బతీసేలా ప్రవర్తించరాదని తెలిపారు. స్టూడెంట్ కిట్ ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపిణీ చేశామని వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫేస్-1,2 పాఠశాలల నాడు, నేడు అన్ని రికార్డ్స్, రిజిస్టర్స్ ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ కె సూర్యనారాయణ, అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్ఎంటిలు, ఎంఇఒ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం దేశ వ్యాప్తంగా జరగనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శ్రావణ్, సాయి కోరారు. విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని కోరుతూ గంటి ప్రసాదం భవనంలో మంగళవారం గోడ పత్రికలను విడుదల చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా జరగనున్న బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థులను, విద్యా సంస్థలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, మణి, రాజేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శ్రావణ్, సాయి పాల్గొన్నారు.

పాటూరులో 'స్టాప్ డయేరియా'

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం పిహెచ్‌సి పరిధిలో గల పాటూరు గ్రామంలో వేపాడ పిహెచ్‌సి సిబ్బంది మంగళవారం స్టాప్ డయేరియా పై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చెందిన అచ్యుత కుమారి, డిఐఒ, డిపిహెచ్‌సిఎల్ సత్యవతి పాల్గొని గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. పిహెచ్‌సి పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎక్కడైనా డయేరియా బాధితులుంటే వెంటనే తమకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వేపాడ, బొద్దాం పిహెచ్‌సిల వైద్యాధికారులు ధరణి, రమాదేవి, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యకు మోక్షం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని కోడూరు గ్రామంలో పూడికపోయిన కాలువలకు మోక్షం కలిగింది. గ్రామంలోని సచివాలయం-1 ఎదురుగా ఉన్న కాలువలు పూడికపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతం చెరువును తలపించేది. ఇటీవల కురిసిన వర్షానికి స్థానికులు నానా అవస్థలు పడ్డారు. టిడిపి బీసీ సాధికారత జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు చొరవ తీసుకొని విషయాన్ని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పరిశీలించిన మేరకు గ్రామ ఉపసర్పంచ్ రెడ్డి కృష్ణ మంగళవారం పూడికతీత పనులను చేయించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సవరవల్లి ఆర్‌బికెలో విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. పంచాయతీ సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. రాయితీపై అందజేస్తున్న విత్తనాలను రైతులందరూ వినియోగించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రావణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జనరిక్ మందులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ రోడ్డులో అశోక్ బంగ్లా పక్కన ఏర్పాటు చేసిన ఎస్‌జి జనరిక్ మందుల షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జనరిక్ మందులు ఇంగ్లీష్ మెడిసిన్ కంటే తక్కువ ధరకు దొరుకుతాయని, అంతేకాకుండా బ్రాండెడ్ కంపెనీలు కూడా వీటిని ఉత్పత్తి చేసిన మందులే జనరిక్ షాపుల్లో విక్రయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముల్లపూడి గురునాథ్, రోహిణి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడిన మద్యం సీసాలను, సారాను అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ డివిజి రాజు ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణంలో మంగళవారం ధ్వంసం చేశారని ఎస్ కోట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 70 కేసులలో పట్టుబడిన 139.68 లీటర్ల మద్యం, 46.8 లీటర్ల బీర్లను, 6.25 లీటర్ల నాటు సారాను గ్రామ మహిళా పోలీసులైన కె.దుర్గా దేవి, ఎం.కన్నతల్లి సమక్షంలో ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.ఫణింద్రబాబు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.